ప్రచార ఆర్భాటంగా పారిశుధ్య పనులు

- వంద రోజుల యాక్షన్ ప్లాన్ ఫొటోల కోసమేనా?
- బడంగ్‌పేట్‌లో పేరుకుపోతున్న చెత్త కుప్పలు
- నేతలు నిలదీస్తేనే తొలగిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

సరూర్‌నగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వంద రోజుల యాక్షన్ ప్లాన్ పేరుతో అధికారులు చేస్తున్న హడావిడి అంతాఇంతా కాదు.. బస్తీలు, కాలనీలపై ప్రేమ పుట్టుకొచ్చినట్టు అధికారులు, సిబ్బంది వచ్చి కొద్దిసేపు పనులు చేసినట్టు ఫొటోలకు పోజులిచ్చి అక్కడి నుంచి వెళ్లి పోతున్నారు. దాంతో వంద రోజుల యాక్షన్ ప్లాన్ లక్ష్యం ఆశించిన స్థాయిలో నెరవేరడం లేదనే విమర్శలు వస్తున్నాయి. బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలో ఈ నెల 2న ప్రారంభమైన వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. నాలాలు, మ్యాన్‌హోళ్లు, యూజీడీ పైపులైన్‌లు శుభ్రం చేస్తున్నట్టు రోజూ మీడియాకు ప్రెస్‌నోట్‌లు, ఫొటోలు పంపిస్తున్నారు. అది చూసి ప్రజలు నిజంగానే తమ ప్రాంతం రూపురేఖలు మారిపోతాయని, చెత్త కనిపించదని భావిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో మాత్రం పరిస్థితులు తద్విరుద్ధంగా ఉన్నాయి.

ఆదాయంపైనే దృష్టి

బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని పలు ప్రాంతాల్లో నెలకోసారి కూడా రోడ్లు, వీధులను శుభ్రం చేయడం లేదు. షాపులు తనిఖీలు చేయడం, ప్లాస్టిక్ కవర్లు వాడుతున్నట్టు తెలిస్తే జరిమానాలు విధించడం, ట్రేడ్ లైసెన్స్‌లు ఉన్నదీ లేనిదీ ఆరా తీయడం, లేని వారికి లైసెన్స్‌లు జారీ చేసి ఫీజులు వసూలు చేయడం వంటి ఆదాయం సమకూరే అంశాలపైనే కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది దృష్టి సారించినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమ ప్రాంతంలో మూడు నెలల నుంచి చెత్త తొలగించడం లేదని సీఎన్‌రెడ్డి కాలనీవాసులు పేర్కొనడం గమనార్హం! నాదర్‌గుల్ 8వ డివిజన్ పరిధిలోని డీపీఎస్ సమీపంలో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త తొలగించడం లేదని స్థానికుడు నరేష్ ఆరోపించారు. ప్రధాన రోడ్ల పరిస్థితే ఇలా ఉంటే ఇక అంతర్గత రోడ్ల పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. శానిటేషన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించాడు.

యాక్షన్ ప్లాన్ లేకుంటే పనులు చేయరా..?

వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా రోజూ కొన్ని డివిజన్లలో పారిశుధ్య పనులు చేస్తూ ప్రజలకు తడిపొడి చెత్త విభజనపై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. వంద రోజుల యాక్షన్ ప్లాన్ లేకపోతే చెత్త తొలగించరా?.. నాలాలు, యూజీడీ పైపులైన్‌లు శుభ్రం చేయరా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ఏదో ఒక ప్రత్యేక కార్యక్రమం చేపట్టే దాకా ఆయా పనులను పట్టించుకోరా? అని మండి పడుతున్నారు. అధికారులు యాక్షన్ ప్లాన్ పేరుతో ఫొటోలు దిగి మీడియాలో పబ్లిష్ చేయించుకోవడమే కాకుండా.. క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమాచారం తెప్పించుకుని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


మల్లాపూర్‌లో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

బీజేపీ నేతల సందర్శనతో అధికారుల్లో కదలిక

సీఎన్‌రెడ్డి కాలనీలో మూడు నెలల నుంచి పారిశుధ్య సిబ్బంది చెత్తను తొలగించడం లేదు. కాలనీలో ఓ వర్గం వారు సిబ్బందిపై దాడులు చేస్తున్నారనే నెపంతో చెత్త తొలగించడం లేదని మునిసిపల్ అధికారులు అంటున్నారు. సీఎన్‌రెడ్డి కాలనీలోని చెత్త సమస్యను స్థానికులు బీజేపీ బడంగ్‌పేట్ శాఖ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన పార్టీ నాయకులతో కలిసి కాలనీని సందర్శించి అక్కడి రోడ్లపై పేరుకుపోయిన చెత్త కుప్పలను పరిశీలించారు. సమస్యను ఆయన మునిసిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. అప్పటికప్పుడు ఆగమేఘాల మీద చెత్తను తొలగించారు. అధికారుల తీరుపై బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


సీఎన్‌రెడ్డి కాలనీలో చెత్తను తొలగిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది



నాదర్‌గుల్ 8వ డివిజన్‌లో డీపీఎస్ సమీపంలో రోడ్డుపై వ్యర్థాలు


ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ప్రభాకర్‌రెడ్డి తదితరులు

బాలాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం

సరూర్‌నగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): బాలాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను కౌన్సిల్ మాజీ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలాపూర్ 16వ డివిజన్‌లో 16 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మహేశ్వరీ జైహింద్‌కుమార్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు బాల్‌నింగని జంగయ్య, బీఆర్ఎస్ నాయకుడు కళ్లెం ఎల్లారెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఇక్కె శ్రీనివాస్, నీరుడి శ్రీరాములు, పగుడాల ఉమేశ్, టేకుల సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మురుగు కాలువలో ఆయిల్ బాల్స్ వేస్తున్న తుర్కయంజాల్ మున్సిపాలిటీ శానిటేషన్ సిబ్బంది

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండండి

హయత్‌నగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వర్షా కాలం ప్రారంభం అయినందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమిషనర్ అమరేందర్‌రెడ్డి అన్నారు. ప్రజలు ఇళ్ల సమీపంలో, కాలనీలలో, గుంతల్లో నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా వాడి పారవేసిన కొబ్బరి బొండాల్లో, టైర్లు, ప్లాస్టిక్ బాటిళ్లలో నీరు నిల్వ కుండా చూడాలన్నారు. ప్రజలు తడి, పొడి చెత్తను స్వచ్ఛ ఆటో కార్మికులకు ఇవ్వాలని కోరారు. స్వచ్ఛ ఆటోలు ఇళ్లకు రాకపోతే ఫిర్యాదు చేయాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. రోడ్డుకు ఇరువైపుల ఉన్న పిచ్చి మొక్కలు, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా మురికి కాలువలు ఉన్నచోట్ల దోమల నివారణ కోసం ఆయిల్ బాల్స్ వేశారు.


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి

వైశాలినగర్‌లో రూ. 8.85 లక్షలతో సీసీ రోడ్డు

సైదాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలని ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి సూచించారు. సోమవారం వైశాలినగర్‌లో రూ.8.85లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. పనులను అధికారులు ఎప్పటికప్పుడూ పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు గోపాల్ రెడ్డి, రవీందర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, తిరుమల్, అచ్యుతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకుడు నరసింహ, రైతులు

అసైన్డ్ రైతులకు పాస్ పుస్తకాలివ్వాలి

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అనాజ్‌పూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి రైతులు, భూ యజమానుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. భూ సమస్యలపై 118 దరఖాస్తులు వచ్చాయని ఆయన తెలిపారు. గ్రామంలోని సర్వే నంబర్ 281లో రైతులకు అసైన్డ్ చేసిన సీలింగ్ భూములకు పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా నాయకుడు ఏర్పుల నరసింహ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. భూ భారతి చట్టం ద్వారా అసైన్డ్ రైతులకు పట్టా పాస్ పుస్తకాలు ఇచ్చి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ ఇంద్రాణి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు వాటర్ బాటిళ్లు అందజేస్తున్న వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో కార్పొరేటర్ నర్సింహారెడ్డి తదితరులు

తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలి

మన్సూరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు, గురువులను గౌరవించడంతోపాటు దేశాన్ని ప్రేమించిన విద్యార్థులే ఉన్నతులుగా ఎదుగుతారని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ బీసీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 120 మంది విద్యార్థులకు బీజేవైఎం నాయకుడు సీమ సోమనాథ్ ఆధ్వర్యంలో సోమవారం వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి, బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా ప్రధానకార్యదర్శి నందికొండ గీతారెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవితారెడ్డి, బీజేపీ మన్సూరాబాద్ అధ్యక్షుడు మునగాల హరీశ్‌రెడ్డి, బీజేవైఎం నాయకులు తదితరులు ఉన్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

ఎల్బీనగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ పేరిట మావోయిస్టులను హతమార్చే చర్యలను తక్షణమే నిలిపివేయాలని సీపీఐ సరూర్‌నగర్ మండల కార్యదర్శి బాతరాజు నర్సింహ, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారగోని ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని మంగళవారం ఇందిరాపార్కు వద్ద చేపట్టనున్న మహాధర్నా వాల్‌పోస్టర్‌ను సోమవారం ఎల్బీనగర్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చర్చలు జరపడానికి సిద్ధమేనని మావోయిస్టులు ప్రకటించినా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. మహా ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఫైమిదా, సీపీఐ సరూర్‌నగర్ మండల సహాయ కార్యదర్శి బోయపల్లి రాములుగౌడ్, సీపీఐ నాయకులు లింగయ్యగౌడ్, యాదయ్య, నర్సింగ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ తీరుపై బీఆర్ఎస్ నాయకుల ఆగ్రహం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కొప్పుల విఠల్‌రెడ్డి

మన్సూరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఏకపక్షంగా వ్యవహరించడంపై బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరికీ సమాచారం ఇవ్వకుండా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం ఏమిటని మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొప్పుల విఠల్‌రెడ్డి ప్రశ్నించారు. ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వకుండా కార్పొరేటర్ ఇటీవల పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడాన్ని ఆయన ఖండించారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విఠల్‌రెడ్డి మాట్లాడుతూ కార్పొరేటర్ వ్యవహరిస్తున్న తీరు సరికాదని, పద్ధతి మార్చుకోవాలని సూచించారు. శ్మశానవాటికను మోడల్‌గా తీర్చిదిద్దుతానని ప్రజాధనాన్ని కార్పొరేటర్ వృథా చేశారని బీఆర్ఎస్ నాయకుడు టంగుటూరి నాగరాజు అన్నారు. కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జి కనుసన్నల్లోనే బీజేపీ కార్పొరేటర్లు పనిచేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు జక్కిడి రఘువీర్‌రెడ్డి, నర్రి వెంకన్న, నర్రి అంజయ్య, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


పరిసరాల పరిశుభ్రతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి

వనస్థలిపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లె నవజీవన్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ ద్వారకామయినగర్ కాలనీలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో సోమవారం శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శానిటేషన్ డీఈ నీలిమా, ఏఈ హేము నాయక్, ఎస్ఎస్ చంద్రశేఖర్, కాలనీ అధ్యక్షుడు ప్రభులింగం, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో వ్యర్థాల తొలగింపు

కొత్తపేట: వర్షాకాలం నేపథ్యంలో చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌ను సోమవారం న్యూ నాగోల్, సమతాపురి తదితర కాలనీల్లో కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ ప్రారంభించారు. ఈస్ట్ మారుతీనగర్, గాయత్రిపురం, ఎస్ఆర్ఎల్ కాలనీ, సీటీఓ కాలనీ, శృంగేరి కాలనీ, న్యూ నాగోల్, శివగంగ కాలనీ, ఆర్టీసీ కాలనీ, భరత్‌నగర్ రాజీవ్‌గాంధీనగర్ ప్రాంతాల్లో వ్యర్థాలను తొలగించి ప్రత్యేక వాహనాల్లో తరలించారు. ప్రజలు, వ్యాపార, వాణిజ్య సంస్థల వారు చెత్తాచెదారాన్ని స్వచ్ఛ వాహనల కార్మికులకు ఇవ్వాలని డీఈ చందనా చౌహాన్ సూచించారు. ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ మూడు రోజులపాటు కొనసాగుతుందని కార్పొరేటర్ తెలిపారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

చంపాపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కర్మన్‌ఘాట్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పలు అంశాలపై పోలీసులు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకట శ్రీను, కె.రాములు నాయక్, ఏఎస్ఐ జి.వెంకటస్వామి, మహిళా ఏఎస్ఐ ఎన్. అనురాధ లైంగిక వేధింపులు, చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలు ఆపదలో ఉంటే డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం పద్మ, పీడీ రఘువీరారెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిగ్రీ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం

హయత్‌నగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలనుకునే వారు దోస్త్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో బీఏ, బీఎస్‌సీ ఫిజికల్ సైన్స్, బీకాం, బీఎస్‌సీ లైఫ్ సైన్సెస్, బీబీఏ కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. వివరాలకు సహాయ కేంద్రం కో-ఆర్డినేటర్ బి. నరసింహ, లేదా 99489-85954 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

నేడు అవంతి కళాశాలలో జాబ్‌మేళా

చాదర్‌ఘాట్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి):దిల్‌సుఖ్‌నగర్‌లోని అవంతి డిగ్రీ, పీజీ కళాశాలలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. మల్టీనేషన్ కంపెనీల ప్రతినిధులు హాజరై అర్హులైన వారిని ఎంపిక చేస్తారన్నారు. డిగ్రీ, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్, డిప్లొమా కోర్సులు చేసిన 2018 నుంచి 2025 బ్యాచ్ విద్యార్థులు జాబ్ మేళాలో పాల్గొనవచ్చన్నారు.

'బోనాలకు నిధులు మంజూరు చేయండి'

సైదాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలకు ఆలయాల వద్ద ఏర్పాట్ల కోసం నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం సౌత్ జోన్ జోనల్ కమిషనర్ వెంకన్నకు వినతిపత్రం అందజేశారు. సైదాబాద్ డివిజన్‌లో అమ్మవారి ఆలయాల వద్ద భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని కోరారు.

రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కారంలో ఎమ్మెల్యే విఫలం

- కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి

ఎల్బీనగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కారంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి విఫలమయ్యారని లింగోజిగూడ కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి ఘాటుగా విమర్శించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జీఓ 118 బాధితుల సమస్యలను టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాధితుల వద్దకు వెళ్లి మాయమాటలు చెబుతున్నారని ఆరోపించారు. ఆరేళ్లయినా రిజిస్ట్రేషన్ల సమస్య సుధీర్‌రెడ్డి పరిష్కరించలేదన్నారు. ఎమ్మెల్యేను బాధితులు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఏళ్లతరబడి ఉన్న సమస్య తమ నాయకుడు మధుయాష్కీగౌడ్‌తోనే పరిష్కారం అవుతుందని రాజశేఖర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

చోరీలు చేస్తున్న ముగ్గురి అరెస్ట్


- 14 తులాల బంగారం, 24 తులాల వెండి వస్తువుల స్వాధీనం

వనస్థలిపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): చోరీలకు పాల్పడుతున్న పాత నేరస్థుడితోపాటు అతడికి సహకరిస్తున్న మరో ఇద్దరిని వనస్థలిపురం పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. కమ్మగూడకు చెందిన గంప అనురాధ(42) తన ఇంటి సమీపంలోగల చాక్లెట్ కంపెనీలో పనిచేస్తూ జీవిస్తోంది. నాగర్‌కర్నూల్ జిల్లా నార్లపూర్ మండలం రామ్‌నాయక్ తండాకు చెందిన పాత నేరస్థుడు మండ్ల శివ(32), ఉడావత్ బాష(33), గొగుల విజయ్(28) ఈనెల 9వ తేదీన అనురాధ ఇంట్లో 14 తులాల బంగారం, 24 తులాల వెండి వస్తువులను అపహరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంతో నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి 14 తులాల బంగారం, 24 తులాల వెండి వస్తువులు, ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. మండ్ల శివ 12 దొంగతనాల కేసుల్లో నిందితుడని ఇన్‌స్పెక్టర్ టి. మహేష్ తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

వేర్వేరు ప్రాంతాల్లో నలుగురి అదృశ్యం

చాదర్‌ఘాట్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో నలుగురు అదృశ్యమయ్యారు. మతిస్థితిమితంలేని వ్యక్తి, తల్లి, ఇద్దరు కుమార్తెలు కనిపించకుండాపోయారు. న్యూ మలక్‌పేట పల్టన్ నివాసి కె. ముఖేష్(45) హయత్‌నగర్‌లో గణేశ్ విగ్రహాలను తయారు చేసి జీవిస్తున్నాడు. కొద్దిరోజులుగా అతడికి మతిస్థిమితం సరిగా లేదు. ఈనెల 13న బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి ఆచూకీ లభించకపోవడంతో భార్య కె. తులసి చాదర్‌ఘాట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తల్లీకుమార్తెలు..


మానస, సుశ్రిత, తేజస్వి

హయత్‌నగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తల్లి, ఇద్దరు కుమార్తెలు అదృశ్యమయ్యారు. నల్లగొండ జిల్లా, నాంపల్లి మండలం, రేవల్లి గ్రామానికి చెందిన తుమ్మలపల్లి రవీందర్‌రెడ్డి, మానస దంపతులు కొంతకాలంగా పెద్దఅంబర్‌పేట సాయినగర్ కాలనీలో నివసిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు సుశ్రిత (18) తేజస్వి (16) ఉన్నారు. నెల రోజుల క్రితం రవీందర్‌రెడ్డి పనిమీద సూర్యాపేట తిరుమలగిరి వెళ్లాడు. పదిరోజుల తర్వాత భార్యకు ఫోన్ చేశాడు. పిల్లలను తీసుకొని రేవల్లి వెళ్లమని చెప్పగా మానస నిరాకరించింది. దీంతో అతడికి కోపం వచ్చి ఇంటికి డబ్బులు పంపడం ఆపేశాడు. ఈనెల 11వ తేదీన భార్యకు ఫోన్ చేసి పెద్దఅంబర్‌పేట్‌కు వస్తున్నానని చెప్పాడు. ఆ రోజు మధ్యాహ్నం అతడు ఇంటికి రాగా తాళం వేసి ఉంది. ఇంటి యజమానిని అడగగా.. దుస్తులు సర్దుకొని వెళ్లారని చెప్పాడు. భార్య, పిల్లల ఆచూకీ లభించకపోవడంతో రవీందర్‌రెడ్డి సోమవారం రాత్రి 7 గంటలకు హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.


అయ్యప్పకాలనీలో సమస్యలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

అయ్యప్పకాలనీలో వరద ముంపు సమస్య పరిష్కారానికి కృషి

మన్సూరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ అయ్యప్పకాలనీలో వరద ముంపు సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే సోమవారం కాలనీలో పర్యటించి వరద ముంపు, డ్రైనేజీ, రోడ్ల సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాగోల్ డివిజన్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి, కాలనీవాసులు నరసింహాచారి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

హుడా కాంప్లెక్స్ పార్కులో గ్రీనరీకి చర్యలు చేపట్టండి


పార్కును పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్, అధికారులు

ఎల్బీనగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్ హుడా కాంప్లెక్స్‌లోని పార్కులో పచ్చదనం పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ అధికారులకు సూచించారు. సోమవారం ఉదయం మార్నింగ్ వాక్‌లో భాగంగా హుడా కాంప్లెక్స్‌లోని పార్కును అధికారులతో కలిసి ఆమె సందర్శించారు. పార్కు అభివృద్ధికి దాదాపు కోటి రూపాయలు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ చందన, వర్క్ ఇన్‌స్పెక్టర్ బుచ్చయ్య, రాంకీ ఎన్విరాన్‌మెంట్ ప్రతినిధి దిలీప్, న్యాక్ ఇంజనీర్ విజయ, జలమండలి మేనేజర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


వరదనీటి కాలువ నిర్మించే ప్రాంతాలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుజాతనాయక్, ఈఈ రోహిణి

త్వరలో వరదనీటి కాలువ నిర్మాణ పనులు

చంపాపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని వందనపురి కాలనీ నుంచి కేకే గార్డెన్ మీదుగా బైరామల్‌గూడ చెరువు వరకు వరద నీటి కాలువ నిర్మాణ పనులను త్వరలో ప్రారంభిస్తున్నామని కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ సుజాతనాయక్ తెలిపారు. సోమవారం కాలువ నిర్మాణం చేపట్టే ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది లేకుండా కాలువ నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఈఈలు రోహిణి, కార్తీక్, డీఈ అనురాధ, ఏఈ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.


కార్పొరేటర్‌కు మురుగు నీటి సమస్యను వివరిస్తున్న కాలనీ అధ్యక్షుడు పీఎంఆర్ రాజు

న్యూ నాగోల్ - స్నేహపురి దారిలో మురుగు నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

కొత్తపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): న్యూ నాగోల్ - స్నేహపురి దారిలో మురుగు నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మురుగు నీరు పొంగిపొర్లుతున్న దారులను పరిశీలించారు. సమస్యను జలమండలి అధికారులకు విన్నవించినా స్పందించలేదని కాలనీ వాసులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను సత్వరం పరిష్కరించాలని జలమండలి అధికారులకు కార్పొరేటర్ సూచించారు. సీనియర్ సిటిజన్ల భవనం రోడ్డులో మురుగు నీటి సమస్యను న్యూ నాగోల్ కాలనీ అధ్యక్షుడు పీఎంఆర్ రాజు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు.